
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 20 మే 2024



రారండోయ్ వేడుక చూద్దాం !

ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవ సంబరం అంబరాన్నంటుతోంది. స్వామివారి కల్యాణం వీక్షించేందుకు రావాలంటూ ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలు, దేవగణాలను ఆహ్వానిస్తూ అర్చకులు వేద మంత్రోచ్చరణలతో ధ్వజారోహణ నిర్వహించారు. కాళీయమర్థనుడిగా శ్రీవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు.

-ద్వారకా తిరుమల

7





కాళీయమర్దనుడి అలంకరణలో దర్శనమిచ్చిన చినవెంకన్న

ధ్వజపటానికి హారతిస్తున్న అర్చకులు

వైభవంగా కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణం

కాళ్ల (ఉండి), మే 19: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం స్వామివారి ఆలయం వద్ద అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నిత్యోపాసన, బలిహరణ, అమ్మవార్లకు అష్టోత్తర శత గులాబీ పుష్పార్చన నిర్వహించారు. మేళతాళాలతో గరుడ వాహనంపై స్వామివారి గ్రామసేవ అనంతరం రాత్రి 7.30 గంటలకు పాంచరాత్ర ఆగమ ప్రకారం కొండూరి వెంకట రమణాచార్యులు, దేవస్థానం వేద పండితుడు అనిపెద్ది ఫణికుమార్ శర్మ, ప్రధాన అర్చకులు సింహాద్రి అప్పలాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తుల విచ్చేసి కల్యాణం తిలకించారు. ఈవో అరుణకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.





స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సార్వాకు సన్నద్ధం



దమ్ము చేస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

ఖరీఫ్ సాగుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం

జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రణాళిక సిద్ధమైంది. వరితో పాటు మినుములు, వేరుశెనగ, ప్రత్తి , చెరకు సాగును మొత్తం 2,13,339 ఎకరాల్లో సాగు చేసేందుకు ఖరీఫ్ ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ప్రధానంగా 1,93,399 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగును చేసేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ధాన్యం వరికోతలు పూర్తయిన వెంటనే దుక్కులు దున్ని సాగుకు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో బోర్ల కింద వరిసాగులో వరి నారుమళ్లు వేసేందుకు రైతులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

- ఏలూరు సిటీ

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగు నిమిత్తం స్వర్ణ, ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, ఎంటీయూ 1121, పీఎల్ 1100 వరి రకాలను సాగు చేస్తారు. కొంతమంది రైతులు పలు వరి రకాలును సాగు చేస్తుంటారు. సాధారణంగా గతంలోనే విత్తన సాగు చేసిన పంట పొలాల నుంచి రైతులు విత్తనాలను తీసుకుని సాగు చేస్తుంటారు. వరి సాగుతో పాటు మినుము, వేరుశనగ, ప్రత్తి, చెరకు సాగు చేస్తారు. వరి సాగు 1,93,399 ఎకరాల్లోనూ, మినుము 4,881 ఎకరాల్లోను, వేరుశెనగ 4,249 ఎకరాల్లోను, ప్రత్తి 7,935 ఎకరాల్లోను, చెరకు 2,326 ఎకరాల్లోను సాగు చేసేందుకు ఖరీఫ్ ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో వరి సాగుకు సంబంధించి పది వేల ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాల్సి ఉంది. ఇప్పటికే రైతులు సాగుకు సంబంధించి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే సాగు ప్రారంభిస్తారు. ఇక బోర్ల కింద సాగులో మాత్రం ముందస్తుగా వరి సాగు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వరి నారుమళ్ల వేసేందుకు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

జిల్లాలో ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి సబ్సిడీపై వరి విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు ఈ సబ్సిడీ విత్తనాలను అందజేస్తోంది. కిలోకు ఐదు రూపాయలు చొప్పున బస్తాకు 150 రూపాయలు సబ్సిడీగా విత్తనాలను సరఫరా చేయటానికి జిల్లా వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో 18 వేల క్వింటాళ్ళ వరి విత్తనాలు రైతులకు అందజేసేందుకు సిద్ధంగా ఉంచారు.

- జిల్లాలో 1,93,399 ఎకరాల్లో వరి సాగుకు నిర్ణయం
- పలు పంటలు కలిపి మొత్తం 2,13,339 ఎకరాల్లో సాగు
- 90 శాతం సబ్సిడీపై ఏజెన్సీ రైతులకు విత్తనాలు
- రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధం

ఏజెన్సీ రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు

ఏజెన్సీ ప్రాంత రైతులకు 90శాతం సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేస్తారు. దీని నిమిత్తం నాలుగు వేల క్వింటాళ్ళ విత్తనాలను సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలకు సంబంధించి ఈ రకంగా సబ్సిడీపై విత్తనాలను అందిస్తారు. సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరు, భీమడోలు, చింతలపూడి, కేఆర్ పురం, కైకలూరు, మండవల్లి, నూజివీడు వ్యవసాయ డివిజన్లలోని మండల కేంద్రాలలో ఈ పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి 11 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులను సిద్ధంగా ఉంచారు. ఇంకా అవసరమైతే ఈ పచ్చి రొట్ట ఎరువులను సరఫరా చేయనున్నట్లు ఖరీఫ్ ప్రణాళికలో పేర్కొన్నారు. ప్రధానంగా పిల్లి పెసరతో పాటు ఇంకో రెండు రకాల పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తున్నారు.

ఖరీఫ్‌కు సిద్ధంగా వున్న ఎరువులు



ఖరీఫ్‌కు సంబంధించి ఎరువులు సిద్ధంగానే ఉంచామని ఇప్పటికే మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ ఉంచినట్లు ఆ ప్రణాళికలో పేర్కొన్నారు. దాదాపుగా మార్క్‌ఫెడ్ గొడౌన్‌లో ఎరువులకు సంబంధించి 4,873 మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్ నిల్వలు ఉన్నాయి. ఇందులో యూరియా 4,238 మెట్రిక్ టన్నులు, 222 కాంప్లెక్స్ ఎరువులు, 413 మెట్రిక్ టన్నులు డీఏపీ ఎరువులు ఉన్నాయి. జిల్లాలోని 27 మండలాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో మొత్తం 1,486 మెట్రిక్ టన్నులు ఎరువుల నిల్వలు ఉన్నాయని, వీటిని రైతులు వినియోగించుకోవచ్చు. ఆర్‌బీకేల్లో 316.1 మెట్రిక్ టన్నుల డీఏపీ, 315.5 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 375.4 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే, 115 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 364.1 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అవసరాలను బట్టి ఇంకా ఎరువులు సరఫరా అవుతాయని జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత విడతలు విడతలుగా ఎరువులు సరఫరా అవుతూనే ఉంటాయని వారు తెలిపారు.

దిగుబడి లక్ష్యం 6.50 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి 6లక్షల 50వేల మెట్రిక్ టన్నులు వరి దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయని ఖరీఫ్ ప్రణాళికలో అంచనా వేశారు. ప్రకృతి సహకరిస్తే వరి సాగులో ఇంకా ఎక్కువగా దిగుబడులు లభించే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

జూన్ మొదటి, రెండు వారాల్లో వరి సాగు ప్రారంభం

ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి వరి నారుమళ్లు వేయడం జూన్ మొదటి, రెండు వారాల్లో ప్రారంభమ వుతాయి. జిల్లాలో ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిసే అవకాశం ఉన్నందున వరి సాగు ముమ్మరంగా సాగుతుంది. ప్రణాళికలో పేర్కొన్నట్టుగా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాం.

- ఎస్‌కే హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఓట్ల లెక్కింపునకు ప్రణాళికలు రూపొందించాలి


- కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి జోషి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరుసిటీ, మే 19: ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిచుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి జోషి రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఢిల్లీ నుంచి ఆయన ఆదివారం పోలింగ్ పూర్తయిన రాష్ట్రాలకు చెందిన ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్న కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై చేపట్టిన చర్యలను తెలియజేస్తూ జిల్లాలో ఏలూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరిగిందని, అనంతరం ఈవీఎంలను పటిష్టమైన భద్రతా వ్యవస్థ మధ్య భద్రపరచటం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రణాళిక రూపొందించుకున్నామని, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ అందించామని తెలిపారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి


ఏలూరు క్రైం, మే 19 : స్ట్రాంగ్ రూముల వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగులు అత్యంత అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏలూరు పార్లమెంటు నియోజ కవర్గానికి సంబంధించిన ఈవీఎం బాక్సులు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల ఈవీఎం బాక్సులను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆదివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ వున్న భద్రత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కాలేజీ చుట్టు పక్కలకు ప్రజలు ఎవ్వరూ రాకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. జిల్లాలో 144వ సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు ముగ్గురు కంటే ఎక్కువ గుమ్మిగూడి ఉండకూడదన్నారు. అనుమానాస్పద వాహనాలను నిత్యం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణ దళాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల కేసులలో ఉంటే వారికి వారి కుటుంబాలకు కలిగే అనర్థాలను వివరంగా తెలిపేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్‌డీఎస్పీ శ్రీహరిరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జగన్ సర్కార్ నిర్వాకంతో..

తమ్మిలేరు ప్రాజెక్టుకు దుర్దశ



తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు రెగ్యులేటర్



శిథిలావస్థకు ప్రాజెక్టు.. పట్టించుకోని పాలకులు

- పంటలకు నీరందక ఆయకట్టు రైతుల ఆగ్రహం
- రూ.16 కోట్లు జైకా నిధులున్నా జరగని పనులు
- మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే తమ్మిలేరుకు మహర్దశ అంటున్నరైతులు

జిల్లాలో 25 వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు, చింతలపూడి పట్టణానికి, ఏటి ఒడ్డు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సవతితల్లి ప్రేమ చూపించిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాతే ప్రాజెక్టుకు మంచి రోజులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

- చాట్రాయి, మే 19

జిల్లాలో వర్షాలు పడేలోపు కనీసం కాల్వలకు పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. సుదీర్ఘకాలం నుంచి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడం వల్ల రెగ్యులేటర్ గేట్లు, మట్టికట్ట, తూములు, రివిట్‌మెంట్, కాలువలు, ఆయకట్టు చెరువులు, కాల్వలపై షట్టర్లు శిథిలావస్థకు చేరటమే కాక జలాశయంలో పూడిక పేరుకుపోయి సామర్థ్యం మేరకు నీరు నిల్వ ఉంచలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఆయకట్టుకు సక్రమంగా నీరందక రైతులు నష్టపోతున్నారు. 25 ఏళ్ళ నుంచి ఆయకట్టు రైతులు ప్రజాప్రతినిధులు తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో 2018లో జపాన్ బ్యాంకు (జైకా) నుంచి రూ.16 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

ప్రాజెక్టు చరిత్ర

ఏలూరు పట్టణానికి వరద ముంపు నివారణ, మెట్ట ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు తమ్మిలేరు ప్రాజెక్టుకు డిజైన్ రూపొందించారు. 1962లో అప్పటి సీఎం దామోదరం సంజీవయ్య ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. పూర్వ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు, ప్రస్తుతం ఏలూరు జిల్లా భూభాగం మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో ఏడు కిలో మీటర్ల మట్టికట్ట, మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1978 నాటికి ప్రాజెక్టు ఉపయోగంలోకి వచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది.

బిల్లులు విడుదల కాక నిలిచిన పనులు

టెండర్ల ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలు కాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండరు రద్దు చేసింది. తీవ్ర జాప్యం అనంతరం 2022లో టెండరు ఖరారు చేసి రైట్ కెనాల్‌లో పనులు ప్రారంభించి, సుమారు రూ.50 లక్షలు పనులు చేసిన తరువాత కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల కాకపోవడంతో ఏడాది క్రితమే పనులు నిలిచిపోయాయి. తెలుగుదేశం అధికారం కోల్పోవడంతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులకు గ్రహణం పట్టింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2 ద్వారా తమ్మిలేరు జలాశయానికి గోదావరి జలాలు అనుసంధానం చేయటానికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇది జరిగితే ప్రాజెక్టుకు మహర్దశ వచ్చినట్లే, ప్రభుత్వ ఉదాశీనత వల్లే నిధులున్నా పనులు జరగడం లేదని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుకు భారీ వరదలు వచ్చినప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని రైతులు, ఏటిఒడ్డు గ్రామాల ప్రజలు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టుకు గండి పడితే ఏలూరు జిల్లాలో ఏటిఒడ్డు గ్రామాలతో పాటు ఏలూరు నగరం మునిగిపోవటమే కాక ప్రాణ ఆస్తినష్టం సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నూతన సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు

జైకా నిధులతో చేపట్టిన పనుల్లో భాగంగా ప్రస్తుతం తమ్మిలేరు ప్రాజెక్టు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలో పూర్తిస్థాయిలో పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

- పరమానందం
ఏఈఈ. తమ్మిలేరు ప్రాజెక్టు

వైసీపీ ప్రభుత్వ తీరు దారుణం



రూ.16 కోట్ల జైకా నిధులున్నా కూడా పనులు చేయకుండా ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణం. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పటమే కానీ ఆచరణ శూన్యమని తమ్మిలేరు ప్రాజక్టు విషయంలో రుజువయ్యింది. రాబోయే కొత్త ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టి పూర్తిస్థాయిలో ఆధునీకరించాలి.

- వెల్ది నాగేశ్వరరావు, రైతు, కొత్తగూడెం, చాట్రాయి మండలం



బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం, మే 19:అల్పపీడన ద్రోణి కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం సుమారు గంటకుపైగా వర్షం పడింది. వర్షం పడేవరకు ఎండ తీవ్రతతో జనాలు ఉక్కిబిక్కి రయ్యారు. మధ్యాహ్నం మూడు గంటలు దాటాక వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి కుండపోతగా కురిసింది. అకాల వర్షం కారణంగా కల్లాల్లో ఉన్న మొక్కజొన్న పంట రైతులు పంటను కాపాడుకోడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కొద్దిపాటి గాలులు రావడంతో ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్‌ను అధికారులు నిలుపుదల చేశారు. కొన్ని రకాల పంటలకు వర్షం మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొసాయిగుంపులో తగ్గని డయేరియా



మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు, మే 19: కొసాయిగుంపు ఆదివాసి గ్రామంలో చోడే జోగి, మడిమి మంచి, చోడే రేణుకులకు వాంతులు, విరేచనాలతో ఆదివారం బాధపడు తున్నట్టు వైద్య సిబ్బంది గుర్తించారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న క్రమంలో వైద్యసిబ్బంది వారిని ఫీడర్ అంబులెన్స్ ద్వారా దామచర్ల వరకు తీసుకొచ్చి అనంతరం 108 వాహనంలో అమరవరం ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే ఆ గ్రామానికి చెందిన ఐదుగురు, కురుములతోగుకు చెందిన ఆరుగురు ఆదివాసీలు కూడా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.. వారి ఆరోగ్యం ఇప్పటికే మెరుగుపడగా మరో రెండు రోజుల తరువాత ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేయనున్నారు. కురుములతోగులో రెండు చేతి పంపులు, కొసాయిగుంపులో ఒక చేతిపంపు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. వైద్య శిబిరం మరో రెండు రోజుల పాటు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్వర్టు కిందికి దూసుకెళ్లిన కారు



దూసుకెళ్లిన కారు

చాట్రాయి, మే 19: ఆంధ్ర-తెలంగాణ రహదారి, విజయవాడ-సత్తుపల్లి రోడ్డులో చనుబండ వద్ద ఆదివారం అడ్డు వచ్చిన పిల్లలను తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టు కిందికి కారు దూసుకుపోయింది. నూజివీడు నుంచి సత్తుపల్లి వెళుతున్న ఈ కారులో కారు నడుపుతున్న వ్యక్తి మాత్రమే ఉన్నాడని, ప్రమాదం జరిగిన వెంటనే బెలూన్స్ తెరుచుకోవడంతో సురక్షితంగా బయటపడి కారు వదిలి అక్కడ నుంచి వెళ్ళిపోయాడని, వివరాలు చెప్పలేదని స్థానికులు అంటున్నారు. వేగంగా కారు ఢీకొనడంతో కల్వర్టు స్లాబు సుమారు రెండు అడుగులు పక్కకు జరిగింది.

క్రైం కార్నర్

లారీ దిగుతూ కిందపడి డ్రైవర్ మృతి



ఆకివీడు, మే 19: డ్రైవర్ లారీ దిగుతూ కిందపడి చనిపోయిన సంఘటన ఆకివీడులో చోటుచేసుకుంది. ఆకివీడు రైస్‌మిల్లు నుంచి లారీ డ్రైవర్ బండి కిషోర్ (38) తణుకు నుంచి నూకలు లోడ్‌ను శనివారం రాత్రి తీసుకువెళ్తున్నాడు. సీఎం హైస్కూ ల్ చూట్ మెమోరియల్ హైస్కూల్ దగ్గరకు వచ్చే సరికి కిషోర్‌కు కడుపులో తిప్పుతుండడంతో లారీ ఆపి కింద దిగుతుండగానే పడిపోయాడు. దీనికి ముందు మరో లారీ వెళ్తుండగా ఆ డ్రైవర్ చూసి లారీ యజమానికి ఫోన్ చేసి స మాచారం అందించాడు. భీమవరంలో పోస్టుమార్టం చేశారు. కిషోర్ భార్య రామలక్ష్మి ఆదివారం చేసిన ఫిర్యాదు మేర ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

డ్రైయిన్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, మే 19 : భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్ వద్ద ఉన్న పెద్ద వంతెనపై నుంచి ఒక యువకుడు యనమదుర్రు డ్రైయిన్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి భీమవరం వన్‌టౌన్ ఎస్‌ఐ మాణిక్యమ్మ తెలిపిన వివరాల మేరకు మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కురసా నాగశ్రీను (28) కాళ్ల మండలం సీసలి గ్రామంలోని ఒక రొయ్యల కంపెనీలో పని చేస్తున్నాడు. రోజులాగానే ఈ నెల 15వ తేదీన విధులకు వెళ్లాడు. సాయంత్రం బంధువులకు ఫోన్ చేసి తాను యనమదుర్రు డ్రైయిన్‌లో దూకి చనిపోతున్నానని ద్విచక్ర వాహనాన్ని ప్రకాశంచౌక్ సెంటర్‌లోని టీ షాపు వద్ద పెడుతున్నాని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే బంధువులు వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనబడింది. నాగశ్రీను ఆచూకి లభ్యం కాలేదు. దీంతో 16వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ నెల 18వ తేదీ సాయంత్రం లాంచీల రేవు వద్ద గుర్రపుడెక్కలో నాగశ్రీను మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతిని బావ బళ్ల వెంకటరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఏలూరు క్రైం, మే 19 : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో వట్లూరు సమీపంలోని సీఆర్ఆర్ మహిళా కళాశాల సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృత దేహం ఉన్నట్లు రైల్వే ఎస్‌ఐ డి.నరసింహారావుకు ఆదివారం సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు, 5.4 ఎత్తు, ఛామనఛాయ శరీరంతో ఉన్నాడు. మృతుడు ముదురు గులాబీ రంగు పొట్టి చేతుల టీ షర్టు, నీలం రంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఏదైనా రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎస్‌ఐ సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం అందించాలని కోరారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కామవరపుకోట, మే 19: గుంటుపల్లి పంచాయతీ కంతమనేనివారిగూడెంలో శనివారం రాత్రి రాజకీయల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ సంఘటనలో అదే గ్రామానికి చెందిన గెడ్డం రవితేజ, దొడ్డిగర్ల మంగ రాజుకు గాయాల య్యాయి. గాయపడిన వారిని స్థానికులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలోని ఒక చెరువు వద్ద పాత కక్షలు నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య వివాదం ఏర్పడింది. మాటమాట పెరగడంతో ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. జాలపర్తి రాహుల్, కొమ్మిన రత్నాజి, గద్దె సుభాష్‌లు తమను గాయపర్చినట్లు పోలీసులకు రవితేజ, మంగరాజు తెలిపారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

పాముకాటుతో మహిళ మృతి

టి.నరసాపురం, మే 19: పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గ మహేశ్వరరావు తెలిపారు. మక్కినవారిగూడెంనకు చెందిన రాజపోయిన రామలక్ష్మి(36)శనివారం పామాయిల్ తోటలోని గింజలు ఏరడానికి కూలికి వెళ్లింది. ఆక్రమంలో ఆమె పాము కాటుకు గురికావడంతో స్థానికులు టి.నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చింతలపూడికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు తండ్రి అలా శ్రీరామ్‌మూర్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పాలకోడేరు, మే 19: గొల్లలకోడేరు గ్రామ శివారు ఏఎస్ఆర్ నగర్‌లో తోట సుష్మిత (33) అనుమానస్పద స్థితిలో ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గొల్లలకోడేరు గ్రామానికి చెందిన తోట త్రినాథప్రసాద్‌తో మొగల్తూరు మండలం నీటితిప్ప గ్రామానికి చెందిన సుష్మితతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 10వ తరగతి, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. త్రినాథప్రసాద్ ఆర్టీఏ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. తోట సుష్మిత ఆదివారం సాయంత్రం ఫ్యాన్‌కి ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీంతో భర్త కుటుంబ సభ్యులకు ఉరివేసుకున్న విషయాన్ని తెలియజేశాడు. అదనపు కట్నం కోసమే తన కుమార్తెను అత్తింటి వారు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని సుష్మిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పాలకోడేరు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై నాళం శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకల దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం, మే 19 : కన్నాయిగూడెంలో మేకలను అపహరిస్తున్న ఆరుగురిని గ్రామస్తులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు కన్నాయిగూడెం గ్రామానికి చెందిన దేవరకొండ మహేష్ ఇంటి వద్ద ఉన్న మేకను యాదవోలు గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దొంగిలించడానికి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు మేల్కోని ఆ దొంగలను పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించగా వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం వల్ల మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి రసాయనిక ఎరువులకు చెక్‌పెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యలో సేంద్రీయ సాగు చేసే రైతులను ప్రోత్సహించే దిశగా ద్వారకాతిరుమల దేవస్థానం అడుగులు వేస్తోంది. శ్రీవారి గోసంరక్షణ శాలలో ఉన్న గోవులను రైతులకు దత్తత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ప్రకృతి సేద్యానికి శ్రీకారం



రైతులకు గోవుల దత్తత దిశగా దేవస్థానం అడుగులు

ద్వారకాతిరుమల, మే 19 : కలుషిత రసాయన క్రిమి సంహారక మందులు కలవని ఆహార పదార్థాలు ప్రకృతి వ్యవసాయం ద్వారా లభ్యమవుతున్నాయి. దీంతో రైతులు అటుగా దృష్టి సారిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో గో మూత్రం, ఎరువును ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శేషాచలంపై ఉన్న శ్రీవారి గోసం రక్షణ శాలలో ఉన్న కొన్ని జాతుల గోవులను, గిత్తలను ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు దత్తత ఇచ్చే కార్యక్రమం తలపెట్టింది.

వీటినే ఇస్తారు

చినవెంకన్న గోసంరక్షణ శాలలో దాదాపు 400 వరకూ వివిధ జాతుల గోవులు, గిత్తలు ఉన్నాయి. ఇందులో పుంగనూరు, కపిల, కాంక్రీట్, గిరి, ఒంగోలు నిమారి, మైసూర్ జాతుల మినహా దేశవాళీ, జెర్సీ జాతులను రైతులకు దత్తత ఇస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ప్రస్తుతం దత్తతకు ఇచ్చే రకానికి చెందిన గోవులు 60 వరకూ ఉన్నట్లు చెప్పారు. గతంలోనూ గో దత్తత కార్యక్రమాన్ని ఆలయ అధికారులు తలపెట్టారు. ఇప్పటి వరకూ సుమారు ఆరు వేల గోవులను రైతులకు దత్తత ఇచ్చారు. దేశంలో లంప్‌స్కిన్ వ్యాధి రావడంతో గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని కొన్నాళ్లగా నిలిపి వేశారు. మరల ఇటీవల గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు గోవులను ఇవ్వాలని నిర్ణయించారు. వాటిని సదరు రైతులు పెంచి పోషించాలే మినహా విక్రయించ కూడదు. వారు వాటిని పోషించలేని పక్షంలో తిరిగి దేవస్థానానికి ఇచ్చేల్సి ఉంటుంది. దత్తత తీసుకున్న రైతులు ఆవులను సంరక్షిస్తూ వాటి ద్వారా వచ్చే గో మూత్రం, పేడ తదితరాలతో ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని అధికారులు చెబుతున్నారు.

దత్తత పొందాలంటే...

రైతులు తమ పొలానికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తక జిరాక్స్ కాపీలు, రూ.100 స్టాంప్ పేపర్, ఆదార్ కార్డు, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ జిరాక్స్, తమ కాంటాక్ట్ నంబర్‌ను ఆలయ కార్యాలయంలో అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓ సూచించారు. ఇలా నమోదు చేసుకున్న వారికి మాత్రమే గోవులను దత్తత ఇస్తామన్నారు.



సకల చరాచర సృష్టికి ఆహ్వానం

ద్వారకాతిరుమల, మే 19: బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ సంబరాలను వీక్షించేందుకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ... ఆదివారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. అనంతరం గరుడ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

అంకురార్పణ ఇలా..

సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి అలంకరించి, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ అర్చకులు పుట్టమన్నును తెచ్చారు. అంతకు ముందే ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో పుట్టమన్నును పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం గరుడపటాన్ని వెండి తొళక్క వాహనంలో ఉంచి ఆ తరువాత ఆలయంలో ధ్వజారోహణను నిర్వహించారు.



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం ఏడు గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవ
- ఉదయం 8.30ల నుంచి భజన సంకీర్తనలు
- రాత్రి ఏడు గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం
- వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, మే 19 : చిన్న తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం, బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండిపోయింది. దాదాపు 15 వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మూడు గంటలకు పైగా దర్శనానికి సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్త తగ్గు ముఖం పట్టింది. దర్శనానంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.



శ్రీవారి అనివేటి మంటపంలో యాత్రికుల రద్దీ

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మరికొన్ని రోజుల్లో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఆయా జిల్లాల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు.

భీమవరం క్రైం, మే 19 : ఇటీవల ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు ఉన్నతాధికారులు ఆదేశాలు రావడంతో పలు ప్రాంతాలను తనిఖీలు చేస్తున్నారు. భీమవరం మండలం కొవ్వాడపుంత గ్రామంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి రూరల్ పోలీసులు తనిఖీలు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కొత్తవాళ్లు ఎవరైనా ఉన్నారా అలాగే నివాసాల్లో పెట్రోల్, రాళ్లు తదితర వస్తువులు నిల్వ చేశారా అన్న కోణంలో తనిఖీలు చేసి ఆధార్‌కార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్‌ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

ఆకివీడు : కుప్పనపూడి శివారు తాళ్లకోడ్‌లోని జగనన్న కాలనీలోని ఇళ్లను పోలీసులు జల్లెడ పట్టారు. వారి ఆధార్ కార్డులు పరిశీలించారు. మారుమూల ప్రాంతమైన తాళ్లకోడ్‌లో కార్డన్ సెరర్చ్ నిర్వహించారు. మోటారు వాహనాల గురించి ఆరా తీశామన్నారు. రికార్డులు లేని తొమ్మిది వాహనాలను గుర్తించామని, అయితే తరువాత వాటి పత్రాలు తీసుకొచ్చి వాహనాలు తీసుకెళ్లారన్నారు. వీరి వెంట పోలీసులు సూర్యనారాయణ, మిలట్రీ దళాలు ఉన్నాయి.

పెనుగొండ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసాపురం డీఎస్పీ పర్యవేక్షణలో ఆదివారం పెనుగొండ సర్కిల్ పరిధిలోని చెరుకువాడ ఏరియాలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ సీఐ నక్కా రజనీ కుమార్, ఎస్‌ఐ షేక్ సుభాణి మాట్లాడుతూ ఈ తనిఖీలలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆచంట ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు : తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి ఆధ్వర్యంలో పెంటపాడులోని ఎస్సీ, బీసీ, కనకసుందర్ కాలనీలలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. మోటర్ సైకిళ్ల రికార్డులు పరిశీలించి రికార్డులు లేకి వాహనాలకు పోలీస్ స్టేషన్‌కి తరలించారు. సీఐ రమేష్, ఎస్‌ఐలు శీలం శంకర్, సురేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పట్టణం జువ్వలపాలెం, యాగర్లపల్లి ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మాత్తుగా ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సెర్చ్‌లో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని మోటారు సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సెర్చ్‌లో పట్టణ ఎస్సైలు జీవీఎస్ ప్రసాద్, సుధాకరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యం, నాగాలాండ్‌కు చెందిన పోలీసులు 80 మంది పాల్గొన్నారు.

మొగల్తూరు : ముత్యాలపల్లి, గెదళ్లవంపు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా లేదా లెక్కకు మించి నగదు ఉందా లేదా సారా, మద్యం ఏమైనా నిల్వ చేశారా వంటి వాటిని ఆరా తీశారు. జిల్లా ఎస్పీ అజిత ఆదేశాల మేరకు డీఎస్పీ జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సుమారు 30 మంది పోలీస్‌లు తనిఖీలు చేపట్టినట్టు ఎస్‌ఐ కె.వెంకట రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.గోవిందరాజు, నరసాపురం రూరల్ ఎస్‌ఐ గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కొవ్వాడపుంతలో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు



పెంటపాడులో తనిఖీ చేస్తున్న పోలీసులు

14 రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, మే 19 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ పనులు జరుగుతున్న దృష్ట్యా 14 రైళ్లను రద్దు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించారు. వీటిలో ఎక్కువగా ఏలూరు మీదుగా వెళ్లే రైళ్లు ఉన్నాయి.

రైలు నం.	ఫ్రం	టు	రద్దయిన తేదీలు
07466	రాజమండ్రి	విశాఖపట్టణం	ఈ నెల 26 నుంచి జూన్ 4 వరకు
07467	విశాఖపట్టణం	రాజమండ్రి	ఈ నెల 26 నుంచి జూన్ 4 వరకు
17219	మచిలీపట్టణం	విశాఖపట్టణం	ఈనెల 27 నుంచి జూన్ 3 వరకు
17220	విశాఖపట్టణం	మచిలీపట్టణం	ఈనెల 28 నుంచి జూన్ 4 వరకు
17240	విశాఖపట్టణం	గుంటూరు	ఈ నెల 28 నుంచి జూన్ 4 వరకు
17239	గుంటూరు	విశాఖపట్టణం	ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు
17243	గుంటూరు	రాయగడ	ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు
17244	రాయగడ	గుంటూరు	ఈ నెల 28 నుంచి జూన్ 4 వరకు
12861	విశాఖపట్టణం	మహబూబ్‌నగర్	ఈ నెల 19 నుంచి జూన్ 3 వరకు
12862	మహబూబ్‌నగర్	విశాఖపట్టణం	ఈ నెల 20 నుంచి జూన్ 4 వరకు
22702	గుంటూరు	విశాఖపట్టణం	ఈ నెల 27 నుంచి జూన్ 4 వరకు
22701	విశాఖపట్టణం	గుంటూరు	ఈ నెల 27 నుంచి జూన్ 4 వరకు
17249	తిరుపతి	కాకినాడ టౌన్	జూన్ 3 వరకు
17250	కాకినాడ టౌన్	తిరుపతి	జూన్ 4 వరకు

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్

ఏలూరు రూరల్, మే 19: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, సెరీకల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఏపీ సెట్‌లో భాగంగా శనివారం ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు నిర్వహించారు. ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్, రామచంద్రా ఇంజనీరింగ్, సిద్ధార్థ ఫెస్ట్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ పర్యవేక్షణలో ఈ నెల 23వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయి. ఆదివారం పరీక్షకు 481 మంది విద్యార్థులకు గాను 467మంది హాజరు అయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసెట్ పరీక్షలకు 200 మందికి 193 మంది, పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 250 మందికి 248 మంది పరీక్షకు హాజరయ్యారు.

భీమవరం : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 175కి 168 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 150కి 146 మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షకు హాజరయ్యారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్షా కేంద్రంలో 100కి 97, నర్సాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 156కి 153 విద్యార్థులు పరీక్ష రాశారు.

అలరించిన నాటికల పోటీలు

రెండో రోజు మూడు నాటికల ప్రదర్శన

ముగ్ధులైన ప్రేక్షకులు



అనూహ్యం నాటికలోని ఒక సన్నివేశం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 19 : కళారంజని నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరంలోని శ్రీసోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో రెండో రోజు ఆదివారం రాత్రి మూడు నాటికలు ప్రదర్శించారు. నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది దశరధీ శ్రీనివాస్, నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లుల సీతారామ ప్రసాద్, మెంటే పూర్ణ చంద్రరావు, ఈ పోటీలను పర్యవేక్షించారు..

'అనూహ్యం'

తల్లిదండ్రులు వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కొడుకులు హక్కుల పేరుతో దక్కించుకోని అనుభవించాలని చూస్తున్నారని రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు 'అనూహ్యం' నాటిక ద్వారా వివరించారు. కష్టించి పనిచేసి స్వయం కృషితో అభివృద్ధి చెందాల్సిన కొందరు కన్నబిడ్డలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహిస్తున్నారని సోమరితనంతో అడ్డదారుల్లో డబ్బు, ఆస్తుల్ని చేజిక్కించుకోవడం కోసం సరికొత్త వ్యూహాలతో తల్లిదండ్రులను ఏలా మోసం చేస్తున్నారో వివరించిన పాలకొల్లు వారి నాటిక 'అనూహ్యం', నాటికకు దర్శకత్వం కత్తుల రామమోహన్‌రావు, నిర్వహణ గుడాల హరిబాబు కాగా, నటులు ఎంవీ రాజర్షి, ఎస్.జ్యోతిరాణి, మాదిరెడ్డి శ్రీనివాస్, ఎస్.మాదవి, బి.శ్యామ్‌శేఖర్, తాళాబత్తుల వెంకటేశ్వరావు, గుడాల హరిబాబు తమ నటనతో ప్రేక్షలను అలరించారు.

'క్షేత్రం'

రైతులు తమ క్షేత్రంలో పంట పండించకపోతే మానవజాతికి తిండి ఉండదని తెలియజేసిన ఆరాధన ఆర్ట్ గుంటూరు వారి 'క్షేత్రం' నాటిక రెండో ప్రదర్శన. మానవ మనుగడకు వ్యవసాయం ఎంతో ముఖ్యమని అటువంటి వ్యవసాయ క్షేత్రాలను కాపాడుకుందాం. ఆడపిల్లలను బతకనిద్దాం బతికించుకుందాం అని చెప్పే నాటిక 'క్షేత్రం' రచన ఆకురాతి, శిల్పా, దర్శకత్వం జీవీ మనోహర్ వహించారు.

'మలిసంధ్య'

భర్తలేని జీవితం భార్యకు, భార్యలేని జీవితం భర్తకు నరక ప్రాయమవుతుందని.. వారిద్దరిలో ఎవరు ముందు వెళ్లి పోయిన ఉన్నవాళ్ల శేష జీవితాన్ని ప్రశాంతంగా ఎలా బతకాలో తెలియజేసిన మూడో నాటిక అనకాపల్లి వారి 'మలిసంధ్య'. ములకథ జీఎస్ లక్ష్మి, నాటకీకరణ గోవిందరాజుల నాగేశ్వరరావు, దర్శకత్వం పి.ముత్యాల రావు వహించారు.

నృత్యోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, మే 19: తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళా కేంద్రంలో జాతీయ సాంస్కృతిక శాఖ (న్యూఢిల్లీ) సహకారంతో 31వ జాతీయ స్థాయి ఉగాది ఆహ్వన నాటికల పోటీలు, నృత్యోత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ నెల 25వ తేదీ వరకూ కొనసాగే ఈ పోటీలను కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల రామారావు పర్యవేక్షించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

'ఉద్యోగుల సొమ్ము దోచేసిన ప్రభుత్వం'

భీమవరం రూరల్, మే 19 : ప్రభుత్వ ఉద్యోగుల సొమ్మును వారికే తెలియకుండా వారి ఖాతాల నుంచి దొంగిలించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల రాష్ట్ర చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ అన్నారు. భీమవరంలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ భవనంలో ఆదివారం సాయంత్రం భీమవరం ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సంఘం ఐక్య వేదిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యనారాయణ మాట్లాడుతూ తమ ఖాతాల నుంచి ఏకంగా రూ.ఐదు కోట్లు ప్రభుత్వం కాజేసిందని ఇటువంటి దారుణమైన పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. తాను నేరుగా ఆరోపణ చేసినా ప్రభుత్వం ఇంత వరకు సొమ్ము గురించి ఉద్యోగులకు సమాధానం చెప్పలేదన్నారు. గతంలో ఈ ఆర్థికపరమైన చెల్లింపులకు ఒక చట్టాన్ని రూపొందించిందని గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వం పిరికి పంద చర్యగా తాను భావిస్తున్నానన్నారు. ప్రభుత్వ స్పాన్సర్ సంఘాలు కొన్ని ఉన్నాయని ఉద్యోగస్తులలో కొన్ని సంఘాలు ఎవరు అధికారంలో ఉంటే వారికే భజన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అందుకనే ఉద్యోగుల్లో చైతన్యం నింపడం కోసం, ఇలాంటి దుర్మార్గ పనులను మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడానికే జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాల సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

వేడుకగా పురస్కారాల ప్రదానం

ఏలూరు రూరల్, మే 19: పశ్చిమగోదావరి జిల్లా రచయితల సంఘం నాలుగో వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ చరిత్రకారుడు, కవి, సాహిత్య విమర్శకుడు కొప్పర్తి వెంకటరమణ మూర్తి విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా నలుగురు ప్రముఖులకు పురస్కారాలను అందజేశారు. ఎంకీ పాటల కవి నండూరి వెంకటసుబ్బారావు స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సినీగేయ రచయిత రసరాజుకు, తొలి చరిత్రకారుడు కావలి బొర్రయ్య స్మారక పురస్కారాన్ని సామాజిక వేత్త బీకేఎస్ఆర్ ఐయ్యంకు, నటశేఖర బంద కనకలింగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటులు పి.విజయ్‌కుమార్‌కు, చల్లపల్లి సీతాదేవి స్మారక సంగీత పురస్కారాన్ని ఏలూరు ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్‌కుమార్‌కు ప్రదానం చేశారు. రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, తెలుగుభాష ఉద్యమకారులు, సాహితీవేత్త జీవీ పూర్ణచందు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి లేళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.నాగాస్త్రి, కె.అబ్రహం, జి.సాంబశివరావు, ప్రముఖ చరిత్ర పరిశోధకులు కె.బద్రినాథ్, వైఎంహెచ్‌ఏ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, రచయితల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు

రహదారి.. దారుణం

• రాళ్లు, గోతులతో ప్రయాణం నరకం • వర్షాలతో మరింత అధ్వానం



అధ్వానంగా లింగపాలెం – అయ్యపరాజుగూడెం రహదారి



రాళ్లు తేలిన లింగపాలెం – కొణిజర్ల రహదారి



గోతులు పడిన కైకరం – గుణ్ణంపల్లి రహదారి

లింగపాలెం / ఉంగుటూరు, మే 19: రాళ్లు తేలిన రోడ్లు.. గోతులు.. చిన్నపాటి వర్షం వచ్చినా మోకాలి లోతు గోతులతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లింగపాలెం, ఉంగుటూరు మండలాల్లో అధ్వాన రహదారులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగపాలెం మండలం తువ్వచిలుకరాయుడుపాలెం, కొణిజర్ల, కొత్తపల్లి, అయ్యపరాజుగూడెం, బాదరాల తదితర గ్రామాల రోడ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై ప్రయాణంలో నరకం కనిపిస్తోంది. వర్షం వస్తే రోడ్లు, చిన్నపాటి చెరువుల్లా మారుతున్నాయి. ఎంత జాగ్రత్తగా వాహనం నడిపినా గోతిలో పడితే ఆస్పత్రికే. రోడ్లు ఎక్కడున్నాయో నీటిలో గోతులు ఎక్కడున్నాయో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఐదేళ్లలో నాయకులు, అధికారులు పట్టించుకున్న పాపానలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉంగుటూరు మండలం కైకరం నుంచి ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లి మీదుగా రహదారి పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కనీసం గుప్పెడు మట్టి కూడా వెయ్యకపోవడంతో ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయం, వర్షాలు పడినప్పుడు ప్రయాణం ప్రమాదభరితమే. కైకరం నుంచి అక్కుపల్లి గోకవరం గ్రామం శివారు వరకు ఆటో ప్రయాణాలు భారంగా మారాయి. రహదారుల దెబ్బకు ఆటోవాలాలు కిరాయి పెంచేస్తున్నారు. సత్తాల, సంద్రగుంట గ్రామాల వద్ద రహదారి గోతులమయంగా కావడంతో ప్రయాణం నరకప్రాయమని స్థానికులు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి రహదారులు మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో కొనసాగుతున్న తనిఖీలు



ఏలూరులో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, మే 19: సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకోసం జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జిలను కూడా తనిఖీ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు అయినప్పటికీ జిల్లాలో ముందస్తు చర్యల్లో భాగంగా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడానికి పోలీస్ పికెట్లను, ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఈవీఎంలను ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచన నేపథ్యంలో అక్కడ మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ కాలేజీ చుట్టుపక్కలకు ఎవరూ రాకూడాదని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘాను కొనసాగిస్తున్నారు.

144 సెక్షన్‌పై పోలీసుల అవగాహన

పెదపాడు, మే 19 : సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామాల్లో తీసుకునే చర్యలపై పెదపాడు పోలీసులు మైక్ ద్వారా గ్రామాల్లో ఆదివారం ప్రచారాన్ని నిర్వహించారు. కౌంటింగ్ ముగిసేవరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ అమల్లో ఉంటాయన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై శుభశేఖర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వారికి గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

● పెదవేగి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 144 సెక్షన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ బి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడచుకోవాలని సూచించారు.

టీడీపీ కూటమి విజయం తథ్యం



సమావేశంలో టీడీపీ నాయకులు

చింతలపూడి, మే 19: చింతలపూడి నియోజకవర్గం, రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం తథ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షకార్యదర్శులు పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం అన్నారు. ఆదివారం జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలు నమ్మారని, కూటమి మేనిఫెస్టో కూడా బావుందని, తాము పోలింగ్‌లో సరళిని పరిశీలిస్తే అనేక విషయాలు తెలిశాయన్నారు. అంతేకాక ఈసారి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా తాము నాయకుల సహకారంతో కృషిచేస్తామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించటానికి జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, తాటి అప్పారావు, ఇరుమెల్లి రామారావు, మన్యం సత్తిబాబు ఉన్నారు.

కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి



చెక్ అందజేస్తున్న యూనియన్ నేతలు

ఏలూరు రూరల్, మే 19: భవననిర్మాణ కార్మికులను పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు కోరారు. ఏలూరులోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జి.లక్ష్మణరావు కుమార్తె వివాహానికి బీవోసీ నుంచి నగదు రాకపోవడంతో హేలాపురి, ప్రైవేట్ ఎలక్ట్రికల్‌వర్కర్స్ యూనియన్, ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కొంత నగదు ఆదివారం అందజేశారు. లక్ష్మణరావు 14ఏళ్లుగా బోర్డులో సభ్యుడైనా నగదు రాలేదన్నారు. బీవోసీ నుంచి కనీసం మట్టిఖర్చుల క్లెయిమ్‌లు కూడా అందజేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో కూడా ఆందోళన చేపట్టి వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పెండింగ్ క్లెయిములు పరిష్కరించి బివోసి బోర్డును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎం.శంకర్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేశ్వరరావు, సహదేవుడు, సిరిగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, మే 19: తెగుళ్ల వలన దిగుబడి తగ్గి నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నేభవన్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ నూజివీడు, చింతలపూడిలో వేలాది ఎకరాల్లో మామిడి తోటలపైనే ఆధారడి రైతులు బతుకుతున్నారని, ఏటా నష్టాలతో మామిడి రైతులు డీలా పడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ పక్క తెగుళ్లు, మరోపక్క గాలి, వాన ఫలితంగా పంట నష్టపోతున్నారని అన్నారు. రాలిపోయిన పండ్లకు ధరలేక రైతులు నష్టాలపాలవుతున్నారని అన్నారు. ఉద్యానశాఖ తెగుళ్ళ పై దృష్టి సారించాలన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం



కర్రసాము శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు టూటౌన్, మే 19: ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, హేలాపురి చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ ప్రారంభమవుతుందని మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఏఆర్‌డీజీకే ఉన్నత పాఠశాలలో ఫ్లెక్సీలను, కరపత్రాలు ఆదివారం ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ శిబిరాన్ని ఆసక్తి గల వారంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత స్వచ్ఛంద సంస్థ నగర అధ్యక్షులు నేతర అజయ్‌బాబు, అడుసుమిల్లి నిర్మల, రత్నాకరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఆసక్తి గల వారు 9346936521నెంబర్‌లో శ్రీనివాసరావును సంప్రదించాలన్నారు.

గ్రామీణ వైద్యులకు ఉచిత వైద్య పరీక్షలు

బుట్టాయగూడెం, మే 19: గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆదివారం రాజమండ్రికి చెందిన పల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు కొల్లూరి లక్ష్మణ్ పరీక్షలు చేశారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ఏజెన్సీలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గ్రామీణ వైద్యసేవలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని సూచించారు. గుండె సంబంధిత వ్యాధులను గుర్తించడం, తీసుకోవలసిన జాగ్రత్తలు, గుండె నొప్పికీ, గ్యాస్ నొప్పికీ తేడాలను వివరించారు. గ్రామీణ వైద్యుల వేదిక అధ్యక్షుడు ఎన్‌వి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు సుందరం, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి త్రినాధ్, మండలంలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు, మే 19 : హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుకలు సంఘీభావం తెలియజేస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడి మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దామంటూ భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రతి సంవత్సరం మే నెలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఐసీటీసీ కౌన్సిలర్ సింహాద్రి పాపారావు తెలిపారు. ఎయిడ్స్ నివారణకు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యులు సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.





టి.నరసాపురం, చింతలపూడి, భీమడోలులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య

ఏలూరు టూటౌన్, మే 19: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనలో అందరూ పయనించాలని వామపక్ష నాయకులు బి.సోమయ్య, బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సుందరయ్య గ్రంథాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రజాసేవకే జీవితం అంకితం చేసిన సుందయ్య బాటలో పయనించాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిషోర్, అమర్‌కుమార్, సుందరయ్య, ఇందిరా, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్‌వీడీప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, కార్మికవర్గం, రైతాంగ పోరాటాలు నిర్వహించిన సుందరయ్య కార్మిక పక్షపాతి అన్నారు. కార్మిక రాజ్యస్థాపనకు అహర్నిశలు కృషిచేసిన వ్యక్తి అని ఆయన ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికై ప్రజాప్రతినిధులు అంటే ఎలా ఉండాలని, సమాజానికి చాటిచెప్పిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.సూర్యకుమార్, జోషి, వాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమర యోధుడు, పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నర్రా అంజనేయులు భవనంలో నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సుందరయ్య త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని, కష్టజీవుల సమస్యలు పరిష్కారం కోసం సమ సమాజమే మార్గమని నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పనిచేసిన ఆదర్శమూర్తిగా సుందరయ్యను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్ కరీముల్లా, కొండలరావు, లక్ష్మణరావు, షఫీరా తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. భీమడోలు సీపీఎం కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆర్ లింగరాజు, ప్రసాదరావు, కట్టా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: పీడిత ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య ప్రతీ ఒక్కరికి ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి నాగేంద్రరావు అన్నారు. కుక్కునూరు, చీరవల్లి, మాధవరం, దాచారం గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సాయికిరణ్, మేడిపల్లి బాబు, కోటా రామలక్ష్మి, లక్ష్మయ్య, వలీభాష, మోహనరావు, మహబూబ్ భాష, కుల్లు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండలంలోని ఏఎస్ఆర్ నగర్ గ్రామస్తులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనుమోలు మురళి మాట్లాడుతూ పార్టీ కోసం ప్రజల కోసం ఆయన యావదాస్తిని అర్పించారని, సుందరయ్య ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో రొట్టె భద్రకాళి, పురం దుర్గమ్మ, తాటికొండ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు, పోలవరం పెట్రోల్ బంక్‌లలో నోటీస్ అందిస్తున్న సిబ్బంది

సీసాల్లో పెట్రోల్ బంద్

పెట్రోల్ బంక్ నిర్వాహకులకు పోలీస్ నోటీసులు

ఏలూరు క్రైం/పోలవరం, మే 19: పెట్రోల్‌ను బాటిల్స్, టిన్నుల్లో పోయించుకుని పెట్రోల్ బాంబులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెట్రోలు బంక్‌లలో సీసాల్లో పెట్రోలు, డీజిల్ విక్రయించకుండా చర్యలు చేపట్టారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలో పెట్రోల్ బంక్ నిర్వాహకులకు ఆదివారం పోలీసులు నోటీసులను జారీ చేశారు. వాహనదారులు, వినియోగ దారులకు ఎట్టి పరిస్థితుల్లో బాటిల్స్, క్యాన్, టిన్నుల్లో పెట్రోల్, డీజిల్ పోయవద్దని, వాహనాల్లో మాత్రమే డీజిల్, పెట్రోలు పోయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని, పెట్రోల్ బంక్ లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. అన్ని పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు పనిచేయాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు తమదైన శైలిలో అన్ని కోణాల్లో ఇప్పటికే నిఘా పెంచారు.

పోలవరంలో పెట్రోలు బంకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. బంకుల నిర్వహకులు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలని, అతిక్రమిస్తే బంకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. పోలవరం పోలీస్ స్టేషన్ సమీపంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంక్, కన్నాపురం అడ్డరోడ్డు వద్ద నయారా పెట్రోలు బంకులకు బాబి నోటీసులు అందించారు. మార్గమధ్యలో ఆగిన ద్విచక్ర వాహనదారులు, గ్రామాల్లో పలుచోట్ల సీసాలతో పెట్రోలు అమ్మకాలు చేసే వారు బంకుల వద్దకు వచ్చి వెనుదిరిగారు. వ్యవసాయ మోటార్లకు డీజిల్ అవసర మైన రైతులు నీరందే పరిస్థితులు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు, మే 19: పెదపాడు సెక్షన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వున్న 11 కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్, 11కేవీ సత్యవోలు, 11 కేవీ గోగుంట ఫీడర్ల పరిధిలో న్యూలైన్ల నిర్మాణం, లైన్ల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వై.రాంబాబు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, సకలకొత్తపల్లి, కొణికి, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు మరియు 11 కేవీ ఫీడర్ పరిధిలో నాయుడుగూడెం పరిసర ప్రాంత వినియోగదారులు సహకరించాలని ఏఈ రాంబాబు కోరారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: విద్యుత్ సరఫరా నిలిపివేతకు వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డీఈఈ పి.రాధాకృష్ణ కోరారు. రాజుపోతేపల్లి 33-11కె.వి సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం 11కె.వి ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనులు ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేలపాలైన పెట్రోల్‌కు నిప్పు పెట్టిన ఆకతాయి

నూజివీడు టౌన్, మే 19: ఆకతాయి చేసిన పనికి మీర్జాపురం గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఐదు ఫైరింజన్లు నిరంతరం శ్రమించాల్సి వచ్చింది. మీర్జాపురం గ్రామం వద్ద శనివారం పెట్రోల్ ట్యాంకరు టైరు పేలి ఆటోను ఢీకొన్న విషయం విదితమే. ట్యాంకర్ బోల్తా పడడంతో పెట్రోల్ నేలపాలు కాగా రహదారి పక్కనే డ్రైన్‌లోకి చేరింది. డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి నిప్పు రాజేయడంతో పెట్రోల్ ఒక్కసారిగా మండి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. సమీపంలోనే పెట్రోల్ బంకు ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే హనుమాన్ జంక్షన్, నూజివీడు, ఏలూరు, గన్నవరం తదితర ఫైర్ స్టేషన్‌ల నుంచి ఐదు అగ్నిమాపక శకటాలు నిరంతరం శ్రమించాల్సి వచ్చింది. శనివారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోగా అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో మంటలు అదుపులోకి తెచ్చారు.



పెదవేగిలో కథలు వినిపిస్తున్న ఉపాధ్యాయుడు



ధర్మాజీగూడెం గ్రంథాలయంలో ప్రత్యేక తరగతులు



ఉంగుటూరులో పుస్తకాలు అందజేస్తున్న డీఎఫ్‌వో

విజ్ఞానానికి తొలిమెట్టు గ్రంథాలయం

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

పెదవేగి, మే 19: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయం తొలిమెట్టు అవుతుందని రామశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేకా లక్ష్మీనారాయణ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం రామశింగవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ విద్యార్థులకు కథలు వినిపించి, వాటిలో నీతి తెలియపర్చారు. గ్రంథపఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. నిత్యం గ్రంథ పఠనం చేస్తే భవిష్యత్‌లో మంచి విజ్ఞానవేత్తగా ఎదుగుతారన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు. చదివిన కథల్లో నీతిని అర్థంచేసుకుని, ఆ దిశగా మంచిని ఎన్నుకుని, జీవించేలా స్ఫూర్తి పొందాలని ఆయన సూచించారు.

ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో..

లింగపాలెం: మండలంలోని ధర్మాజిగూడెం, లింగపాలెం శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో పలు నీతి కథలు చదివించడం, రాయించడం చేశారు. అనంతరం విద్యార్థులచే పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు నీతికథలు వివరించారు. విద్యార్థులకు చెస్, క్యారెమ్స్ పలు ఆటలు నేర్పించారు. విద్యార్థులకు సంబంధించి పలు పుస్తకాలను వాటిలో ఉన్న విజ్ఞాన సంబంధ వివరాలు తెలియజెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు సిహెచ్ వెంకటరమణ, లతీఫ్ పాల్గొన్నారు.

డీఎఫ్‌వో పుస్తక వితరణ

ఉంగుటూరు: విద్యార్థుల ప్రయోజనార్థం ఉంగుటూరు శాఖా గ్రంథాలయానికి డీఎఫ్‌వో ప్రభాకరరావు పలు పుస్తకాలు అందజేశారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్ స్టడీ మెటీరియల్‌ను గ్రంథపాలకుడు సీహెచ్.గంగాధర్‌కు అందించారు. వచ్చే నెలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు తల్లాప్రగడ భీమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం




ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, పట్టిసీమ ఆలయాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణం



విశేషాలంకరణలో రాట్నాలకుంట రాట్నాలమ్మ



ఏలూరులో సూర్యనారాయణస్వామికి అలంకరణ

వైభవంగా శ్రీవారి కల్యాణం

ఏలూరు కల్చరల్, మే 19: రూరల్ మండలం మాదేపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది వైశాఖమాసం ఏకాదశి రోజు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి అమ్మవార్లను ఉంచారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణ మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా స్వామి వార్ల కల్యాణం..

పోలవరం: మండలంలో పట్టిసీమ, పాత రామయ్యపేట, బోడిగూడెం గ్రామాలలో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, బోడిగూడెం పద్మావతీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, పాత రామయ్యపేట మహానందీశ్వరస్వామి ఆలయాలలో కల్యాణోత్సవాలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల, పోలవరం నగరేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● భీమడోలు: గుండుగొలను వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. నిత్య పూజలతో పాటు 26న అన్నసమారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

రమా సత్యనారాయణ స్వామి కల్యాణం

కుక్కునూరు: మండల పరిధిలోని దాచారంలో ఆదివారం రమా సత్యనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చలువ పందిర్లు వేసి కల్యాణం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఏటా దాచారం సత్యనారాయణస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం అన్న సమారాధన చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంట రాట్నాలమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్: సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించారు. తొలుత అంబికాదేవికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరు పవర్‌పేటలో ధన్వంతరి వైద్య భగవానుని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. పలువురు భక్తులు సూర్యనమస్కార పూజలు నిర్వహించారు.



ఎగసిపడిన మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నేలపాలైన పెట్రోల్‌కు నిప్పు పెట్టిన ఆకతాయి

» ట్యాంకర్‌ను తొలగించడంతో తప్పిన ముప్పు

నూజివీడు టౌన్, మే 19: ఆకతాయి చేసిన పనికి నూజివీడు మండలం మీర్జాపురం గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఐదు ఫైరింజన్లు నిరంతరం శ్రమించాల్సి వచ్చింది. శనివారం నాడు నూజివీడు మండలం మీర్జాపురం గ్రామం వద్ద పెట్రోల్ ట్యాంకరు టైరు పేలి ఆటోను ఢీ కొన్న విషయం విదితమే. ట్యాంకర్ బోల్తాతో భారీగా పెట్రోల్ నేలపాలు కాగా రహదారి పక్కనే ఉన్న డ్రైన్‌లోకి అది చేరింది. అయితే ఆ డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి నిప్పు రాజేయడంతో పెట్రోల్ ఒక్కసారిగా మండి ఆ మంటలు ఘటనా స్థలం వద్దకు చేరి అగ్నికీలలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మరోవైపు సమీపంలోనే పెట్రోల్ బంకు ఉండటంతో అనుక్షణం ఆందోళనకు గురయ్యారు. వెంటనే హనుమాన్ జంక్షన్, నూజివీడు, ఏలూరు, గన్నవరం తదితర ఫైర్ స్టేషన్‌ల నుంచి ఐదు అగ్నిమాపక శకటాలు నిరంతరం శ్రమించాల్సి వచ్చింది. శనివారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోగా అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆదివారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో వాటిని మంటలు అదుపులోకి తెచ్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ నుంచి లీకైన పెట్రోల్‌కు మంటలు అంటుకోవడానికి ముందే సదరు ట్యాంకర్‌ను పోలీసులు ప్రమాదసంఘటనా స్థలం నుంచి దూరంగా తరలించడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.





పగిలిన గ్యాస్ పైపులైన్.. పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

గ్యాస్ పైప్‌లైన్ లీక్

» అధికారుల చర్యలతో తప్పిన ముప్పు

ముదినేపల్లి, మే 19 : ముదినేపల్లి - గుడ్లవల్లేరు ప్రధాన రహదారిలో తరచూ డొమెస్టిక్ గ్యాస్ పైపులైన్ లీకేజీపై అధికారులు స్పందించారు. పైపులైన్ల ఏర్పాటును పరిశీలించి భవిష్యత్తులో లీకేజీలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధులకు తెలిపారు. ముదినేపల్లి - గుడ్లవల్లేరు రహదారిలో గతంలో పెనుమల్లి వద్ద, తాజాగా శనివారం రాత్రి ముదినేపల్లి సమీపంలో ఈ గ్యాస్ పైపులైన్ లీకైంది. ఆ రోడ్డులో టెలిఫోన్ స్తంభాన్ని తొలగించేందుకు ఒక వ్యక్తి ఎక్స్‌కవేటర్‌తో ప్రయత్నిస్తుండగా, పైపులైన్ పగిలి గ్యాస్ లీకయింది. వెంటనే ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోగా గ్యాస్ సుమారు 30 నిముషాల సేపు లీకయింది. పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ ఎస్.ఎల్.ఎస్.కుమారి ఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బందిని పంపారు. పైపులైన్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు కూడా చేరుకుని గ్యాస్ సరఫరాను నిలిపేసి పగిలిన పైపు స్థానంలో కొత్త పైపును ఏర్పాటు చేశారు. దీనిపై తహసీల్దార్ ఆ సంస్థ ప్రతినిధులతో చర్చించి ముదినేపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన గ్యాస్ పైపులైన్లను పరిశీలించి గ్యాస్ లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు పక్కన రెండు అడుగుల లోతులోనే ఈ పైపులైన్లను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు.

కలెక్టర్‌కు నివేదిక పంపుతా : తహసీల్దార్

గ్యాస్ పైపులైన్ లీకేజీలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.ఎల్.ఎస్.కుమారి తెలిపారు. పైపులైన్లు ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులకు కూడా నోటీసులు జారీ చేస్తామని, పైపులైన్ల ఏర్పాటుకు సరైన ప్రమాణాలను పాటించాలని ఆదేశిస్తామని తెలిపారు.



కాట్రేనిపాడు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

వానొస్తే అంతే మరి!

ముసునూరు, మే 19: మండలంలోని చిల్లబోయినపల్లి, కాట్రేనిపాడు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమై చిన్నపాటి చెరువులను తలపించాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. పలు కాలనీల్లో అంతర్గత రహదారులు కోతకు గురవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు ఒక మోస్తరుగా వీయడంతో అరటి, ఇతర ఉద్యానవన పంటలకు నష్టం కలుగలేదు. అలాగే మిగిలిన గ్రామాల్లో కూడా ఒక మోస్తరు వర్షం కురిసింది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికి రోడ్లపైనే వర్షపునీరు, మురుగునీరు ప్రవహించి దుర్వాసన వెదజల్లి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డ్రైనేజీలు, రోడ్ల ప్రక్షాళన ఎటూ లేదు.. వర్షాలు పడుతున్నందున కనీసం పారిశుధ్య చర్యలైనా చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆచవరం నుంచి శ్యామలాంబపురం వెళ్ళే రహదారిలో పుల్లవ డ్రెయిన్‌లో సగభాగం విరిగిపడిన వంతెన

ప్రాణాలతో చెలగాటం..

» సగభాగం కూలిన వంతెన

» ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

» నీట మునిగినా రాకపోకలు సాగించాల్సిందే

» అభివృద్ధికి నోచుకోని వంతెనలు » పట్టించుకోని సర్కారు

కైకలూరు, మే 19: దశాబ్దాల కాలం నాటి వంతెనలు ఆలనా పాలనా లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీస మరమ్మతులు చేసి కూడా ఏళ్ళు గడుస్తున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపునకు మునగడం, ఎండకు ఎండడం జరుగుతోంది. అయినా అధికారులు స్పందించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అలాగే అదే పుల్లవ డ్రెయిన్‌పై ఆచవరం నుంచి శ్యామలాంబపురం వెళ్ళే రహదారిలో వంతెన సగభాగం ధ్వంసమైంది. నిత్యం ఆయా రహదారుల్లో వేలామంది ప్రజలు, వాహనాలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ వంతెనలకు ఎలాంటి మరమ్మతులు లేకపోవడంతో ప్రజల పడుతున్న బాధలు వర్ణనాతీతం. వంతెన శిథిలమైన చోట ఎలాంటి వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో అనేకమంది వంతెన వద్ద ప్రమాదాలకు గురైన ఘటనలు కోకొల్లలు. కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఆ ప్రాంతంలో లేకపోవడంతో కొత్తగా వచ్చినవారు వంతెన పరిస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు నూతన వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నూజివీడులో సుందరయ్య చిత్రపటం వద్ద సీపీఐ నాయకుల నివాళి



ఆగిరిపల్లిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్యకు ఘన నివాళి

నూజివీడు టౌన్, మే 19: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని నూజివీడు సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమ్యూనిజం భావాలు ప్రతి ఒక్కరిలోనూ బలపడితేనే సమసమాజ నిర్మాణం సాధ్యమన్నారు. సీపీఐ నూజివీడు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, సీపీఎం నాయకులు దుర్గారావు, నందూరి పద్మాంజలి, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆగిరిపల్లిలో ఆదివారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీ మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, గోపాలరావు, శామ్యూల్, అయ్యన్న, శ్రీను, బాలు, స్టాలిన్ తదితరులు సుందరయ్యకు నివాళులర్పించారు.

కలిదిండి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా కలిదిండిలో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి



కలిదిండిలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద సీపీఎం నాయకుల నివాళి

ఘనంగా నివాళులర్పించారు. కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి వ్యవసాయ కార్మికులకు సంఘం ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేసిన సుందరయ్య చిరస్మరణీయుడన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఆయన ఆశయాలను యువత నెరవేర్చాలన్నారు. సీపీఎం నాయకులు శేషపు మహంకాళిరావు, వీరవల్లి భాస్కరరావు, జ్ఞానేమ, రఘురామ్, సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంగం సురేష్, ఐద్వా మండల కార్యదర్శి శేషపు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవాలు ప్రారంభం

కలిదిండి, మే 19 : కలిదిండిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆత్రేయ బాబు, లీలా కృష్ణమాచార్యులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బోయిన రామకృష్ణ, మేనేజర్ బి.గోపాలరావు, ధర్మకర్తలు మురళీకృష్ణ, శ్రీనివాసరావు, నాగభవాని, శాంతి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి జగన్నాథస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్, మే 19: చిన్న పూరిగా పేరుగాంచిన వడాలిలో నెల 21వ తేదీ నుంచి 26 వరకు జగన్నాథ స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 21న వేణుగోపాలస్వామివారిని, రుక్మిణి, సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ 22వ తేదీ బుధవారం రాత్రి దివ్య కల్యాణం, 23వ తేదీ రాత్రి రథోత్సవం, 24న పూర్ణాహుతి, 25న ద్వాదశ ప్రదక్షిణలు, 26న ఉదయం 11 గంటల నుంచి అఖండ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన

ముదినేపల్లి, మే 19 : ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఆటలు, కథల పోటీలు జరిగాయి. పలువురు డిగ్రీ విద్యార్థులు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కైకలూరు, మే 19: ఒకే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుని 24 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆదివారం కైకలూరు మండలం తామరకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ, వ్యాపారాల్లో స్థిరపడిన వీరంతా కలుసుకుని నాటి గురువులను సన్మానించారు. అందరూ కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు. రోజంతా పాఠశాలలోనే గడిపి సమీపాన ఉన్న పంట పొలాలను తిలకిస్తూ ఉత్సాహంగా గడిపారు. నున్న రాంబాబు, లేళ్ళ సునీల్, ఎం. రవి, గంగుల శ్రీనివాసరావు, దుమ్మేటి చంద్రరావు, ఉచ్చుల హరి, దండే ప్రసన్న, దాసరి రామారావు, బొల్లంపల్లి నాగప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కొనకళ్లకు టీడీపీ నేతల పరామర్శ



ముదినేపల్లి, మే 19 : అనారోగ్యానికి గురై విజయవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ రావును టీడీపీ నేతలు ఆదివారం పరామర్శించారు. కైక లూరు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహా రావు, ఏలూరు జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, పార్టీ నాయకులు వీరమల్లు సత్యనారాయణ, కట్టా కోటేశ్వరరావు తదితరులు పరామర్శించారు.

పెట్రోలు బంకులకు నోటీసులు

ముదినేపల్లి, మే 19 : పెట్రోల్ బంకుల్లో ఎవ్వరికీ డబ్బాల్లో కానీ, బాటిల్స్‌లో గానీ పెట్రోలు, డీజిల్ పోయవద్దని ఎస్ఐ వెంకట్ కుమార్ బంక్ యజమానులకు ఆదివారం నోటీసులు జారీ చేశారు. వాహనాల్లో తప్ప బాటిల్స్‌లో పెట్రోలు, డీజిల్ ఇవ్వవద్దని పేర్కొన్నారు. బంకుల్లో బాటిల్స్ ద్వారా పెట్రోలు కొనుగోలు చేసిన వారు వాటిని ఉపయోగించి అల్లర్లకు పాల్పడినా, ప్రమాదాలకు కారకులయినా, అటువంటి ఘటనలపై నమోదయ్యే కేసుల్లో సంబంధిత బంకుల యజమానులను కూడా బాధ్యులుగా చేర్చుతామని నోటీసులలో పేర్కొన్నారు.

పండు ఈగను నివారించండిలా..

నూజివీడు టౌన్, మే 19: అకాల వర్షాల నేపథ్యంలో మామిడిలో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఏలూరు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ అన్నారు. నూజివీడు మండలం వెంకటాయపాలెం, అన్నవరం, దిగవల్లి గ్రామాల్లో ఉద్యానవనశాఖ అధికారులు పర్యటించి మామిడి తోటలను పరిశీలించి మాట్లాడుతూ పండు ఈగ ఉధృతి నివారణకు ప్లాస్టిక్ పళ్ళెంలో మిథైల్ యూజినాల్ రెండు ఎంఎల్, మూడు గ్రాముల కార్బోఫ్యూరన్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి తోటల్లో వేలాడదీయాలన్నారు. లేదా మలాథియాన్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా మిథైల్ యూజినాల్ ఎరలను 4 నుంచి 6 వరకు ఎకరానికి పెట్టాలని సూచించారు. ఇదేకాక బంగినపల్లి రకంలో కాయకుళ్ళు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఆగిరిపల్లి మండలంలో బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
226	సీతారాంపురం	715	646	90.35
227	,,	709	634	89.42
228	,,	733	673	91.81
229	ఈదర	656	634	96.65
230	,,	816	773	94.73
231	,,	867	811	93.54
232	,,	1031	916	88.85
233	,,	1160	1029	88.71
234	,,	746	660	88.85
235	,,	696	616	88.71
236	,,	1201	1079	89.84
237	శోభనాపురం	685	617	90.07
238	,,	672	607	90.33
239	,,	1129	1000	88.57
240	బొద్దనపల్లి	991	934	94.25
241	,,	614	573	93.32
242	అడవినెక్కలం	881	744	84.45
243	,,	783	707	90.29
244	,,	1118	1016	90.88
245	,,	1119	986	88.11
246	,,	1129	987	87.42
247	కనసానపల్లి	796	730	91.71
248	,,	729	695	95.34
249	పోతవరప్పాడు	738	683	92.55
250	నూగొండపల్లి	1062	974	91.71
251	మల్లిబోయినపల్లి	340	318	93.53
252	రాజవరం	921	840	91.21
253	తోటపల్లి	656	617	94.05
254	,,	666	633	95.05
255	నరసింగపాలెం	682	622	91.20
256	,,	665	642	96.54

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
257	,,	1125	910	80.89
258	,,	1167	932	79.86
259	,,	1262	967	76.62
260	,,	1253	1074	85.71
261	,,	620	550	88.71
262	,,	723	632	87.41
263	,,	1209	1045	86.44
264	అమ్మవారిగూడెం	837	762	91.04
265	చిన్నాగిరిపల్లి	1185	1052	88.78
266	గొల్లగూడెం	693	648	93.51
267	సర్దాలగూడెం	612	571	93.30
268	వడ్లమాను	864	803	92.94
269	,,	805	729	90.56
270	చొప్పరమెట్ల	748	689	92.11
271	తాడేపల్లి	909	866	95.27
272	వట్టిగుడిపాడు	1160	997	85.95
273	,,	1124	983	87.46
274	,,	1145	1031	90.04
275	అనంతసాగరం	388	332	85.57
276	ఈదులగూడెం	762	681	89.37
277	,,	499	443	88.78
278	,,	1171	1074	91.72
279	కలటూరు	590	554	93.90
280	,,	590	562	95.25
281	సగ్గూరు	1071	1001	93.46
282	కృష్ణవరం	878	822	93.62
283	,,	460	435	94.57
284	కొమ్మూరు	1014	904	89.15
285	సూరవరం	518	468	90.35
286	పి.సూరవరం	668	620	92.81



లక్ష్మీనరసింహ స్వామికి రజత కవచం బహూకరణ

ఆగిరిపల్లి, మే 19: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామికి ఆగిరిపల్లికి చెందిన మడుపల్లి రామనాగ లక్ష్మీ నారాయణ కుమారుడు అశోక్ రూ. నాలుగు లక్షల విలువైన రజత కవచం సమర్పించారు. ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు కవచ సంప్రోక్షణ, అలంకరణ, అర్చన, శాంతి కల్యాణం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఉభయ దాతలుగా అశోక్‌కుమార్ దంపతులు పాల్గొనగా ఆలయ ఈవో పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ

ముదినేపల్లి, మే 19 : ముదినేపల్లిలోని చలివేంద్రంలో స్థానిక విజయలక్ష్మి ట్రాన్స్‌పోర్టు ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 600 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. సంస్థ యజమాని ఎనుముల అంకినీడు, రెడ్ క్రాస్ సొసైటీ ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షుడు వెలివెల గోపీనాథ్ తదితరులు మజ్జిగ పంపిణీ చేశారు.

నూజివీడు అర్బన్‌లో
తగ్గిన పోలింగ్ శాతం



నూజివీడు, మే 19: నూజివీడు నియోజకవర్గంలో పోలైన ఓట్ల శాతం పరిశీలిస్తే నూజివీడు నియోజకవర్గం పరిధిలోని రూరల్ మండలాల కన్నా నూజివీడు అర్బన్ పరిధిలో పోలైన ఓటింగ్ శాతం తగ్గింది. నూజివీడు పట్టణంలో మొత్తం ఓటర్లు 42,262మంది ఉండగా, వీరిలో పురుషులు 20,236, స్త్రీలు 22,020, థర్డ్ జెండర్ 6 ఓట్లు ఉన్నాయి. నూజివీడు పట్టణంలో 48 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటిలో ఒక బూత్‌లో మాత్రమే 87.41 శాతం ఓట్లు పోలై పట్టణ పరిధిలో ప్రథమ స్థానంలో ఉండగా, మరో బూత్‌లో అత్యల్పం 63.77 శాతం పోలైంది. మిగిలిన వాటిలో 65 నుంచి 80 శాతం వరకు పోలింగ్ జరిగింది. ఇది ఈ నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం. కారణం ఈ నియోజకవర్గంలో ఫలితాన్ని ప్రభావితం చేసేది అనాదిగా నూజివీడు పట్టణం, చాట్రాయి మండలంలో రాజకీయ పార్టీలకు వచ్చే ఓటింగ్ శాతం. దీంతో రెండు ప్రధాన రాజకీయ పార్టీలు నూజివీడు పట్టణంలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు పడి ఉంటాయి అనే అంశంపై మల్లగుల్లాలు పడుతూ ఆరా తీస్తున్నారు.

పెరిగిన మహిళా ఓటింగ్

ముదినేపల్లి, మే 19 : సార్వత్రిక ఎన్నికల్లో ముదినేపల్లి మండలంలో మహిళల ఓటింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో మహిళా ఓటింగ్ శాతం 83 ఉండగా, ఈ ఎన్నికల్లో 87 శాతానికి పెరిగింది. మండలంలో మహిళా ఓటర్లు 25,211 మంది ఉండగా, 21,859 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 30 పోలింగ్ బూత్‌లలో 90 నుంచి 97 శాతం మహిళలు ఓటింగ్‌లో పాల్గొనగా, 27 బూత్‌లలో 80 నుంచి 90 శాతం మహిళలు ఓటు వేశారు. నాలుగు బూత్‌లలో మాత్రమే 67 నుంచి 80 శాతం మహిళా ఓటింగ్ నమోదయింది. పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం బూత్‌లో అత్యధికంగా 97 శాతం మహిళా ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా వైవాక 109 నంబరు బూత్‌లో 66 శాతం నమోదైంది. నియోజకవర్గంలో అత్యధికంగా 95.85 పోలింగ్ శాతం నమోదైన పెనుమల్లిలో అదే స్థాయిలో మహిళా ఓటింగ్ నమోదైంది.

మెజార్టీపై బెట్టింగ్‌లు

కలిదిండి, మే 19 : కలిదిండిలో కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎంత మెజార్టీతో విజయం సాధిస్తారనే దానిపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కామినేని 15 వేలు మెజార్టీతో గెలుపొందుతారని హెచ్చు బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. లంక గ్రామాల్లో కామినేని మెజార్టీపై లక్షలాది రూపాయల పందేలు కాస్తున్నారు.



చిత్తపూరు నం.42 పోలింగ్ కేంద్రంలో రాత్రి వరకు జరుగుతున్న పోలింగ్ (ఫైల్)

పోలింగ్ కేంద్రాన్ని మార్చండి సారూ..

» చిత్తపూరు మండల పరిషత్ పాఠశాల ఇరుకు భవనంతో ఓటర్ల ఇక్కట్లు

» పోలింగ్ రోజున రాత్రి 11.30 వరకు ఓటింగ్

చాట్రాయి, మే 19: మండలంలోని చిత్తపూరులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇరుకు భవనంలో ఉన్న నంబరు 42 పోలింగ్ కేంద్రాన్ని, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ బిల్డింగ్‌లోకి మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఇక్కడ రాత్రి 11.30 గంటల వరకు జరగటం గమనార్హం. 2019 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కూడా ఇక్కడ రాత్రి 12 గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్ కేంద్రంలో 1204 ఓట్లు ఉండటం, భవనం ఇరుకుగా ఉండటం, ఒకే డోరు ఉండటం పోలింగ్ ఆలస్యానికి కారణమని గ్రామస్థులు అంటున్నారు. ఓటు వేయటానికి వెళ్ళే వారు, ఓటు వేసి తిరిగివచ్చే వారు ఒకే ద్వారం నుంచి రాకపోకలు సాగించవలసి రావటంతో క్యూ సాఫీగా సాగటం లేదు. దీనితో ఓటర్లు 5, 6 గంటలు క్యూలో నిలబడి నరకయాతన అనుభవిస్తున్నారు. మహిళల బాధలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఉన్నతాధికారులు పరిశీలించి, ఓటర్ల ఇబ్బందులు పరిగణనలోకి తీసుకొని ఈ పోలింగ్ కేంద్రాన్ని స్థానిక జడ్పీ హైస్కూల్ భవనంలోకి మార్చాలని మాజీ సర్పంచ్ కొత్తపల్లి రామదాసు విజ్ఞప్తి చేశారు.



శ్రీవారి అనివేటి మండపంలో యాత్రికుల రద్దీ

సకల చరాచర సృష్టికి
ఆహ్వానం

ద్వారకాతిరుమల, మే 19: బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ సంబరాలను వీక్షించేందుకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ... ఆదివారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడపటాన్ని ఎగురవేశారు. అనంతరం గరుడ ప్రసాదాన్ని మహిళా భక్తులకు పంపిణీ చేశారు.

అంకురార్పణ ఇలా..

సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి అలంకరించి, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ అర్చకులు పుట్టమన్నును తెచ్చారు. అంతకు ముందే ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో పుట్టమన్నును పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం గరుడపటాన్ని వెండి తొళక్క వాహనంలో ఉంచి ఆ తరువాత ఆలయంలో ధ్వజారోహణను నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం ఏడు గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ
- ఉదయం 8-30 నుంచి భజన సంకీర్తనలు
- రాత్రి ఏడు గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం
- వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

చిన్న తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం, బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండిపోయింది. దాదాపు 15 వేల మందికి పైబడి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మూడు గంటలకు పై సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్త తగ్గు ముఖం పట్టింది. దర్శనానంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.